క్లుప్తంగా

ఏఎంసీ చైర్మన్‌కు ప్రజాప్రతినిధుల సత్కారం


ఏఎంసీ చైర్మన్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

దెందులూరు: దెందులూరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన అప్పన ప్రసాద్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ కార్యవర్గాన్ని అభినందించారు. అందరికీ పదవులు కేటాయించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావుకు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తులసీరామ్, వెంకటేశ్వరరెడ్డి తదితరులున్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

దెందులూరు: నెల రోజులపాటు కఠినమైన ఉపవాస దీక్షలు చేసి సర్వమానవాళికి సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులకు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణతో త్యాగానికి, దాతృత్వానికి ప్రతిరూపం రంజాన్ మాసమని వారన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు సంతోషంగా పండుగ జరుపుకోవాలని వారు కోరారు.

ధాన్యం తరలింపునకు రవాణా సౌకర్యం కల్పిస్తాం

భీమడోలు: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం జాతీయ రహదారి పూళ్ల వద్ద రైతులు ఆందోళన చేసారు. మిల్లులకు ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలను సిద్ధం చేస్తున్నామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని తహసీల్దార్ షంషూద్దీన్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు రైతులకు నచ్చజెప్పారు. అక్కడ నుంచి జేసీ లావణ్యవేణికి ఫోన్‌లో వారు సమస్యను వివరించారు. రవాణా సౌకర్యం కల్పిస్తామని ఉన్నతాధికారుల హామీ మేరకు రైతులు ఆందోళన విరమించారు. రహదారికి ఇరువైపులా నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

ఇళ్ల నిర్మాణంపై సమీక్ష

పెదపాడు: మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంతో పురోగతి సాధించాలని పెదపాడు మండల ప్రత్యేక అధికారి జీవీకే మల్లికార్జునరావు తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేసారు. పెదపాడు తహసీల్దార్ జీ విజయ్‌కుమార్ రాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, పీహెచ్‌సీ వైద్యులు డాక్టరు చక్రధర్, ఈఓపీఆర్డీ సూర్యకుమార్, ఈఓ మేకా శ్రీనివాస్, వెంకటేశ్వరావు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అధికారులందరూ ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

వలంటీర్ వ్యవస్థ చరిత్రాత్మకం

పెదవేగి : వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రజలకు పథకాలను అందించడం చరిత్రాత్మక విషయమని పెదవేగి మండల ప్రత్యేకాధికారిణి నాగరాణి అన్నారు. పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకాధికారి అధ్యక్షతన, ఎంపీడీఓ రాజీమనోజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ మండల పరిధిలో 7 వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 21 నుంచి 26 వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పెదకడిమిలో, గార్లమడుగు, జగన్నాథపురం, బాపిరాజుగూడెం, రాట్నాలకుంటలో పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె చెప్పారు.

వృద్ధుడి అదృశ్యం

పెదపాడు: ఓ వృద్ధుడు అదృశ్యంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలంలోని వేంపాడుకు చెందిన మరీదు రాము వృద్ధాప్యం కారణంగా ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం ఉదయం 11గంటల సమయంలో భార్య గేదెలను కట్టి రమ్మని పంపించింది. అప్పటి నుంచి కనపడక పోవడంతో కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినూత్న పద్ధతిలో సాగు

దెందులూరు: వ్యవసాయ విద్యనభ్యసించే విద్యార్థులు నిత్యం వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులను తెలుసుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్యామ్‌రాజ్ నాయక్, వ్యవసాయ శాఖ ఏలూరు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుబ్బారావు అన్నారు. శుక్రవారం దెందులూరులోని వీరమాచినేని శివాజీ కల్యాణ మండపంలో రైతు సదస్సు విద్యార్థులకు వ్యవసాయ కృషి పని అనుభవంపై అవగాహన కార్యక్రమాన్ని రావేప్ విద్యార్థులు, దెందులూరు ఏఓ గద్దె రమేష్ సంయుక్తంగా నిర్వహించారు. మార్టేరు వరి పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ భారతలక్ష్మి పాల్గొన్నారు.

అంతర పంటలు.. ఆదాయం భళా

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- స్వల్పకాలంలోనే పంట చేతికి
- అన్నదాతలకు ఆర్థిక భరోసా

పెదవేగి : వాణిజ్య పంట సాగులో అంతర పంటలుగా వివిధ రకాల కూరగాయలు, పూలసాగు చేస్తూ పెదవేగి మండలంలోని కొందరు రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. వాణిజ్య పంటలకు దీర్ఘకాలంగా పెట్టుబడులు పెట్టాల్సి ఉండటంతో రైతులు అదనపు ఆదాయ వనరుగా అంతర పంటలను సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటల రైతులు మార్కెట్‌లో ఫలసాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలను కోల్పోవటం, గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఈ అంతర పంటలు ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ఈ పంటల సాగుతో ప్రధాన పంటకు పెట్టుబడి కోసం అప్పుల కోసం వెళ్లాల్సిన పని లేకుండా అంతర పంటలు ఆదాయాన్నిస్తున్నాయి.

నియోజకవర్గంలో 3,750 ఎకరాల్లో అంతర పంటలు

దెందులూరు నియోజకవర్గంలో సుమారుగా 3,750 ఎకరాల్లో అంతర పంటలు సాగవుతున్నాయి, వీటిలో అధికంగా పెదవేగి, కొండలరావుపాలెం, బాపిరాజుగూడెం, విజయరాయి, జగన్నాథపురం, రామశింగవరం, కూచింపూడి, వేగివాడ, టి గోకవరం, చల్లచింతలపూడి, మేదినరావుపాలెఎం, రామారావుగూడెం పంగిగూడెం, కొక్కిరిపాడు, వేంపాడు గ్రామాల్లో అంతర పంటలు సాగు చేస్తున్నారు.

అంతర పంటలుగా ఎన్నో రకాలు

వాణిజ్య పంటలైన అరటి, కంద, కొబ్బరి, పసుపు, జామ, వంటి పంటల్లో బెండ, మిరప, ఆకుకూరలు, వంగ వంటి పంటలతో పాటు పూల సాగును అంతర పంటలుగా వేస్తున్నారు. వాణిజ్య పంటలు


గార్లమడుగులో అరటిలో అంతర పంటగా నిమ్మ


కొబ్బరిలో అంతర పంట సాగుచేస్తున్న జామ

వేసిన నాటి నుంచి ఫలసాయం అందడానికి 9 నుంచి 11 నెలల సమయం పట్టడంతో రైతులు అప్పటి వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఈ ఏడాది అరటి, కంద పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొబ్బరికి గిట్టుబాటు ధర ఉన్నా దిగుబడి లేకపోవడంతో ఆదాయం అంతంత మాత్రంగానే వచ్చింది. దీనితో ఈ తోటల్లో పసుపు, అరటి, కోకో, కంది, కూరగాయలు సాగు చేస్తున్నారు.

ఎన్నో లాభాలు

వాణిజ్య పంటలకు ఏడాది పొడవునా పెట్టుబడి అవసరం. అంతర పంటల సాగుకు పెట్టుబడి తక్కువ, ఎక్కువ ఆదాయం, కలుపు బెడద నివారణ కారణంగా రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందుల ధరలు చుక్కలనంటాయి. దీంతో ఒక పంటను సాగుచేసి లాభాలు ఆర్జించడం కష్టతరమవుతుంది. వాణిజ్య పంట అధిక దిగుబడి వచ్చినా ఆ సమయంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోతే రైతు నష్టపోవాల్సి వస్తుంది. అంతర పంటలతో కేవలం 45 రోజుల్లో ఫలసాయం పొంది లాభాలు ఆర్జించవచ్చని రైతులు చెబుతున్నారు. కాయగూరల సాగుతో నిత్యం ఆదాయం లభిస్తోందని రైతులు చెబుతున్నారు.

తెగుళ్లనూ తరిమేయొచ్చు

అంతర పంటలతో భూములకు, రైతులకు ఎంతో మేలని వ్యవసాయాధికారి ప్రియాంక తెలిపారు. ఈ పంటల వల్ల పంటల్లో వచ్చే తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందన్నారు. ఇందుకు కారణం పూలసాగుతో అక్కడకు వచ్చే మేలు చేసే మిత్ర పురుగులు క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటాయని చెప్పారు. దీనివల్ల వాణిజ్య పంటలకు తెగుళ్లు ఆశించవని వెల్లడించారు. పంట మార్పిడి వల్ల భూసారం పెరుగుతుందన్నారు.

ఎటువంటి ఇబ్బందీ లేదు



పొలం కౌలుకు తీసుకుని కొబ్బరి, కోకో సాగుతో పాటు అంతర పంటలుగా ఆనప, బీర పాదులు పందిరి ఏర్పాటు చేసి సాగు చేస్తున్నాను. బంతి మొక్కలు కూడా వేశాను. వీటి వల్ల పెట్టుబడి తక్కువ, అదనపు ఆదాయం వస్తోంది. ఆర్థికంగా అంతర పంటలు ఆదుకుంటున్నాయి.

– పంజగల నరశింహరావు, కౌలు రైతు, కొండలరావుపాలెం

లాభాలు ఆర్జిస్తున్నాను



వాణిజ్య పంటలో ఏదో ఒకటి అంతర పంట వేస్తాను. కొబ్బరిలో కోకో, ఆయిల్ పామ్‌లో కోకో అంతర పంటగా సాగు చేస్తున్నాను. దీనితో నీటి అవసరం తక్కువ, కలుపు నివారణ, పురుగు మందులు, ఎరువుల ఖర్చు తక్కువ కారణంగా పెట్టుబడికి ఇబ్బంది ఉండటం లేదు. అంతర పంటల సాగుతో లాభాలు ఆర్జిస్తున్నాను.

– పులగం వేణుగోపాలరెడ్డి, రైతు, విజయరాయి

నేడు నిడమర్రులో గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిడమర్రు గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి జరిగిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గోవాలని సత్యకుమార్ కోరారు.

అసిస్టెంట్ కలెక్టరుకు వీఆర్వో విధులపై శిక్షణ


అసిస్టెంట్ కలెక్టరు అపూర్వ భరత్‌కు స్వాగతం పలుకుతున్న వీఆర్వోలు

పెదపాడు: పెదపాడు మండలంలోని వట్లూరు గ్రామ సచివాలయం 2లో అసిస్టెంట్ కలెక్టరు అపూర్వ భరత్ వీఆర్వో శిక్షణ తీసుకోనున్నారు. ఈమేరకు వట్లూరు గ్రామ సచివాలయానికి శుక్రవారం ఆయన చేరుకున్నారు. శనివారం నుంచి 4వారాల పాటు ఆయన వీఆర్వో శిక్షణ తీసుకోనున్నారు. వట్లూరు వీఆర్వోలు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, వీఆర్వో రవికుమార్ తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- నిడమర్రులో రూ.2.80కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం

నిడమర్రు: గ్రామాల్లో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. నిడమర్రు శుక్రవారం మండల కేంద్రం నిడమర్రులో రూ.2.80 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో క్రొవ్విడి, తోకలపల్లిలో విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణాలకు రూ. 6.40 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. లోవోల్టేజ్, సేఫ్టీ నిర్వహణకు సంబంధించి మండలంలో రూ.3.25 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, లోవోల్టేజీ సమస్యలతో వినియోగదారులు ఇబ్బందులు పడే వారన్నారు. ప్రస్తుతం ఏ అంతరాయం లేకుండా నిర్విరామంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఈ ఉపకేంద్రం ఏర్పాటుతో 8 గ్రామాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లతో నిర్మించిన నిడమర్రు విద్యుత్ ఉపకేంద్రంతో లోఓల్టేజ్, బ్రేక్ డౌన్ సమస్య తీరిపోనున్నాయన్నారు.


నిడమర్రులో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

సరిపల్లి సబ్‌స్టేషన్‌కు రూ.110 కోట్లు మంజూరు

గణపవరం, నిడమర్రు మండలాల్లో ఆక్వా అభివృద్ధి చెందుతుండటంతో భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకుని సరిపల్లిలో భారీ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వాసుబాబు ప్రకటించారు. అక్కడ 132/33 నిర్మాణంకోసం ప్రభుత్వం రూ.110 కోట్ల నిధులు మంజూరయ్యాయని త్వరలో నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. నిడమర్రు మండలంలో ఆక్వా చెరువులకు సంబంధించి 10 ఎకరాల్లోపు రైతులకు అందించే సబ్సిడీ భారం రూ.21 కోట్ల వరకూ ప్రభుత్వం భరిస్తుందన్నారు. 200 యూనిట్లు వినియోగం కలిగిన నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు ఏడాదికి రూ.22.5లక్షలు వరకూ రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల కన్వీనర్లు సంకు సత్యకుమార్, నౌడు అచ్యుతరామారావు, సర్పంచ్ పొట్నూరి ఉమా, ఎంపీటీసీ దూసంపూడి సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు పోలిశెట్టి రమేష్, ఉప సర్పంచ్ పోలిశెట్టి మురళి, పార్టీ అధ్యక్షుడు గుడిసే జాన్‌బాబు, జిల్లా సర్పంచ్‌ల చాబర్ ఉపాధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, ముదునూరి త్రివేణి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మాన్‌రాజు, ఈఈ ఎన్ వెంకటేశ్వరరావు, ఏఈలు టి. వెకకటేశ్వరారవు, చంద్రశేఖర్, మురళికృష్ణ తదితరులున్నారు.

భీమడోలులో పంచకర్ల సత్యనారాయణకు సత్కారం

భీమడోలు: భీమడోలు విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా పంచకర్ల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమడోలులోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇటీవల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అల్లా రామ్మోహనరావు మృతి చెందడంతో నూతన ఎన్నిక అనివార్యమైంది. దీనితో నూతన అధ్యక్షుడుగా పంచకర్ల సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్.పరదేశిరావు, కోశాధికారిగా జి.నూకరాజుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. నూతన అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణను సత్కరించారు. సంఘం ప్రతినిధులు పాలేటి బ్రహ్మారావు, ఎస్‌వీబీ వసంత


భీమడోలులో నూతన కమిటీ అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణను సత్కరిస్తున్న సంఘు నాయకులు

రావు, వి.రంగారావు, వైఆర్‌కే శర్మ, .జి.అప్పారావు, ఏడీ ప్రసాద్, రాజారత్నం, బాబూరత్నం, కోటయ్య, భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

దోసపాడులో పోలీస్ పికెట్

దెందులూరు: దోసపాడులో శుక్రవారం మరోసారి దళితులు, సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఏళ్ల తరబడి దళితుల భూములు పెద్దల చేతుల్లో కబ్జాకు గురయ్యాయని, వాటిని పేదలకు పంచాలని దళిత సంఘాలతో పాటు కమ్యూనిస్టు నాయకులు ఉద్యమం చేస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో భూములు స్వాధీనం చేసుకుంటామని వెళ్తున్న సందర్భంలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు, పెదవేగి సీఐ ఎన్.దుర్గాప్రసాద్ సకాలంలో స్పందించి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దోసపాడులో హుటాహుటిన పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వివాదాస్పద భూముల వద్దకు ఎవరినీ వెళ్లనీయకుండా గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా తహ


దోసపాడులో ఆందోళన చేస్తున్న దళితులను సముదాయిస్తున్న దెందులూరు ఎస్సై వీర్రాజు

సీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య 144 సెక్షన్ విధించారు. ఎట్టకేలకు గ్రామంలో, వివాదాస్పద భూముల వద్ద ఎటువంటి సమస్య తలెత్తకపోవడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధి పథకాలకు ప్రజల ఆమోదం

దెందులూరు: గ్రామంలోని ప్రతి గడపలోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలందరూ సంతోషం ఆమోదం తెలియజేస్తున్నారని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. శుక్రవారం నాగులదేవునిపాడులో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని


నాగులదేవునిపాడులో జగనన్నే మా భవిష్యత్తుపై సర్వే చేస్తున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం

అన్నారు. వార్డు మెంబర్లు కొండపల్లి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సొంగా వెంకటేశ్వరరావు, గృహసారథులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు

పెదవేగి : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు గౌడ బజారులోని ప్రతి గడపకు వెళ్లి సీఎం జగనన్న అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు స్థానిక నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతనేని రమాదేవి, ఎంపీటీసీ మట్టా రాగిణి, ఉప సర్పంచ్ పులపాక గాంధీజీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు చల్లారి గంగాధరరావు, వార్డు మెంబర్స్, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళ మృతి

పెదపాడు: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై పెదపాడు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు మండలంలోని మసీదుపాడుకి చెందిన దుర్గాభవానిని ఆమె భర్త రాజేష్ మూడేళ్ల క్రితం పాతముప్పర్రులోని పుట్టింటి వద్ద వదిలేసాడు. దీంతో ఆమె మనస్తాపం చెంది గురువారం ఉరి వేసుకుంది. ఇది గమనించిన తల్లి ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం దుర్గాభవాని మరణించింది. తల్లి సానబోయిన శాంతకుమారి ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నిర్మాణం నిలుపుదల

భీమడోలు: గుండుగొలనులోని గణేష్ నగర్‌లో హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం వివాదాస్పదమైన భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టడంతో గ్రామ పంచాయతీ అధికారులు ఆ పనులను నిలుపుదల చేశారు. గ్రామ పంచాయతీలు, పోలీసుల సమక్షంలో హైకోర్టు ఆదేశానుసారం అక్రమంగా ఇల్లు నిర్మిస్తుండగా స్లాబ్ సెంట్రింగ్‌ను జేసీబీ సాయంతో తొలగించారు.సెంట్రింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 28/12లో రెవెన్యూ శాఖకు సంబంధించిన వివాదాస్పద భూమిలో 22 మందికి పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాలు చెల్లబాటు కావని ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా అదే ప్రాంతానికి చెందిన నల్ల వరదాయిని, సూర్యనారాయణ పంచాయతీ నుంచి అనుమతులు పొందకుండా ఇల్లు నిర్మించుకునేందుకు సిద్ధమయ్యారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడంతో వారికి పలు సార్లు పంచాయతీ నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదు. భీమడోలు ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ ఆదేశాలతో గ్రామ కార్యదర్శులు వచ్చి తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజల సుఖసంతోషాలే ధ్యేయంగా ప్రభుత్వ పాలన

నిడమర్రు: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం బావాయిపాలెంలో రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం 143వ రోజుకు చేరుకుందని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు లబ్ధిదారులతో మాట్లాడారు. వారు చెప్పిన సమస్యలు పరిష్కరించేలా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేసారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు మద్దతు తెలిపాలని కోరారు. ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్ నౌడు అచ్యుతరామారవు, సర్పంచ్ ముత్యాల సుజాతబాలాజీ, గ్రామపార్టీ అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బయ్య, ఎంపీటీసీ ముత్యాల సుబ్బలక్ష్మి సుబ్బారావు, రైతునేత గొట్టుముక్కల విశ్వనాథరాజు, వైసీపీ నేతలు సంకు నాగేషు, సంకు పద్మాకర్, వడ్డి పెదకాపు, బొబ్బిలి కిషోర్, దారాబత్తుల సర్రయ్య, వావిశెట్టి రాము, బొబ్బిలి యేసుబాబు, ముత్యాల ఉదయభాస్కర్, ముత్యాల సత్యనారాయణ పుప్పాల శ్రీనివాసరావు తదితరులున్నారు.


ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గోదావరి కాల్వపై కొత్త వంతెన

భీమడోలు: గోదావరి కాల్వపై గల శిథిల వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో బ్రిటిష్ కాలం నాటి వంతెన కూలిపోయింది. ఈ వంతెనలపై రాకపోకలు సాగించే మూడు మండలాల ప్రజలు ఇబ్బందులు లేకుండా బ్రెయిలీ వంతెనను నిర్మించిన విషయం తెలిసిందే. ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ పనులు చేసేందుకు జీవీ ఇన్‌ఫ్రా కంపెనీకి కాంట్రాక్ట్ పనులు చేపట్టనుంది. దీనితో శుక్రవారం వంతెన నిర్మాణానికి ప్రాథమికంగా కొలతలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, జీవీ ఇన్‌ఫ్రా కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమావేశమయ్యారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ జీవీ భాస్కరరావు, ఇరిగేషన్ ఎస్ఈ కె.శ్రీనివాసరావుతో పలు అంశాలపై చర్చించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు వాసుబాబు సూచించారు. ఈనెలాఖరున గోదావరి కాల్వ మూసివేసిన అనంతరం పనులు చేపడతామని ఎమ్మెల్యే వాసుబాబుకు అధికారులు తెలిపారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. ఆర్అండ్‌బీ ఈఈ వైవీ కిషక్షర్‌బాబు, డీఈ ఎం.గోవిందమోహన్, ఏఈ జే.భాస్కరరావు, ఇరిగేషన్ డీఈ సత్యదేవ్, ఏఈ ఏ.మాధవరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు, సొసైటీ చైర్మన్ నంద్యాల సుబ్బరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువూరి సత్యనారాయణరాజు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న భూసర్వేతో వివాదాలకు చెక్

గణపవరం: భూసర్వేతో శాశ్వతంగా భూవివాదాలకు చెక్ పడుతుందని గణపవరం సర్పంచ్ మూర అలంకారం అన్నారు. శుక్రవారం గణపవరంలో జగనన్న భూహక్కు– భూరక్ష కార్యక్రమంలో డ్రోన్ సర్వే ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, నాయకులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు చేస్తాం

భీమడోలు: రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని గుండుగొలను సొసైటీ అధ్యక్షుడు నంద్యాల సుబ్బరాజు, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు అన్నారు. గుండుగొలను ఆర్‌బీకే -1,2 వద్ద శుక్రవారం ఆందోళన చెందుతున్న రైతులతో వారు సమావేశమయ్యారు. ప్రతి పక్షాలు చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు సూచించారు. ధాన్యం రవాణాపై ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వారు భరోసా కల్పించారు.

ఎగుమతులపై పర్యవేక్షణ

ఉంగుటూరు: ధాన్యం ఎగుమతులు, సంచుల సరఫరా పారదర్శకంగా జరిగేలా మండల స్థాయి, గ్రామ స్థాయిలో పర్యవేక్షించాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి గుండ వరపు వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశం మందిరంలో సచివాలయ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.